

అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

ట్రంకులైన్, సీసీ రోడ్డు పనుల పరిశీలన

హయత్‌నగర్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ డివిజన్‌లోని గ్రీన్‌వుడ్‌కాలనీ, బ్లడ్‌బ్యాంకుకాలనీ, కమర్షియల్ ట్యాక్సుకాలనీ, మిధానీకాలనీలో జరుగుతున్న భూగర్భ ట్రంకులైను, సీసీరోడ్డు పనులను కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి జలమండలి అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ అధికారులు లెవల్స్ సరిగా చూసి ఇబ్బందులు రాకుండా ట్రంకులైను నిర్మించాలని కోరారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని భారీ సైజు లైను వేయడం జరుగుతుందన్నారు. కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు దగ్గర ఉండి పనులు చేయించుకోవాలని సూచించారు. కాంట్రాక్టర్ నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులు పూర్తిచేయాలని కోరారు. డివిజన్‌లోని అన్ని కాలనీలలో ముందుగా సీసీ రోడ్లు పూర్తి చేస్తామని అన్నారు. మిధానీ కాలనీలో మరిన్ని సీసీ రోడ్లు నిర్మించాలని కాలనీవాసులు కార్పొరేటర్‌ను కోరారు. కార్యక్రమంలో జలమండలి మేనేజర్ రాజు, హయత్‌నగర్ డివిజన్ ఏఈ హేమానాయక్, కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు నర్సింహ, శ్రీనివాస్, గణేష్, శేఖర్‌రెడ్డి, అంజయ్యతో పాటు పలువురు పాల్గొన్నారు.



క్రాంతినగర్‌కాలనీలో కల్యాణ వేంకటేశ్వరస్వామి గర్భాలయ గుమ్మం పూజా కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి

వేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్పొరేటర్ పూజలు

చంపాపేట, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ క్రాంతినగర్‌కాలనీలో కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గర్భాలయ గుమ్మం పూజా కార్యక్రమం వింజమూరి రామానుజాచార్యులు ఆధ్వర్యంలో స్థపతి శ్రీనివాసాచారి గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వంగా చంద్రారెడ్డి, ఆలయ ఛైర్మన్ సత్యనారాయణగౌడ్, కార్యదర్శి ఆనంద్, కాలనీ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

13 నుంచి ఆలయ వార్షికోత్సవాలు

మన్సూరాబాద్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ డివిజన్ చిత్రసీమకాలనీలోని అభయాంజనేయస్వామి ఆలయ 12వ వార్షికోత్సవాలు మే 13, 14, 15వ తేదీల్లో నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ సభ్యులు జేజే రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా విజయవాడలోని అష్టాక్షరీ జీయర్‌స్వామిని ఆలయ కమిటీ సభ్యులతో కలిసి వార్షిక బ్రహ్మోత్సవాలకు రావాలంటూ ఆహ్వానించి స్వామివారి మంగళశాసనాలను అందుకున్నట్లు జేజేరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు డీవీ రమణ, రామ్‌గోపాల్, పీఎంఎస్‌కే కుమార్ పాల్గొన్నారు.



బ్రహ్మోత్సవాలకు అష్టాక్షరీ జీయర్‌స్వామిని ఆహ్వానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు



ఐరిస్ ఫ్లోరెస్ట్ పాఠశాలను ప్రారంభిస్తున్న డీసీపీ ప్రవీణ్‌కుమార్ తదితరులు

నాణ్యతతో కూడిన విద్యను అందించాలి : డీసీపీ

వనస్థలిపురం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): సమాజంలోని అన్నివర్గాల ప్రజలకు నాణ్యతతో కూడిన విద్యను అందించడానికి ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలు కృషిచేయాలని ఎల్బీనగర్ డీసీపీ ప్రవీణ్‌కుమార్ అన్నారు. వనస్థలిపురం డివిజన్ ఓంకార్‌నగర్‌లో ఏర్పాటు చేసిన ఐరిస్ ఫ్లోరెస్ట్ పాఠశాలను డీసీపీ ప్రవీణ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలు ధనార్జనే ధ్యేయంగా కాకుండా అన్నివర్గాల ప్రజలు నాణ్యమైన విద్యను పొందడానికి మానవతా దృక్పథంతో పాఠశాలల ఫీజులు ఉండాలని సూచించారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని రాణించాలన్నారు. రిటైర్డ్ ఏసీపీ ఉదయ్‌భాస్కర్, వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, పాఠశాల నిర్వాహకులు సుజయ్‌కిరణ్, కిరణ్మయి, మిహిరా పాల్గొన్నారు.



పెద్దఅంబర్‌పేట్‌లో మేడే పోస్టర్‌ను విడుదల చేస్తున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ తదితరులు

మేడే పోస్టర్ విడుదల

అబ్దుల్లాపూర్‌మెట్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ప్రపంచ కార్మికుల దినోత్సవం మేడేను విజయవంతం చేయాలని సీఐటీయూ రంగారెడ్డి ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ పిలుపునిచ్చారు. గురువారం పెద్దఅంబర్‌పేట్‌లో జిల్లా నాయకుడు ఏర్పుల నర్సింహ, కార్మికులతో కలిసి చంద్రమోహన్ మేడే పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతోమంది కార్మికులు తమ రక్తాన్ని చిందించి 8గంటల పని దినాన్ని సాధించుకున్న సందర్భంగా మేడేను జరుపుకుంటామన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక చట్టాలను కాలరాయాలని చూస్తోందని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పే విధంగా మేడేనే ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్మికులు మైసయ్య, పోచయ్య, రవి పాల్గొన్నారు.

మన్సూరాబాద్ : దేశంలోని ప్రతి కార్మికుడికి ఎనిమిది గంటల పనిదినాలను చేయాలని డిమాండ్ చేస్తూ నాటి కార్మిక వర్గం చేసిన పోరాటాల స్ఫూర్తితో ప్రజావ్యతిరేక విధానాలపై ప్రతి కార్మికుడు పోరాడాలని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు కీసరి నర్సిరెడ్డి పేర్కొన్నారు. కార్మిక చట్టాలు నిలబెట్టుకునేందుకు లేబర్ కోడ్ల రద్దునకు మే 1, 20వ తేదీల్లో నిర్వహించే సమ్మెను కార్మిక వర్గం జయప్రదం చేయాలని కోరుతూ మన్సూరాబాద్ డివిజన్ ఆటోనగర్‌లో మేడే పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సీహెచ్ కృష్ణయ్య, పి.నర్సిరెడ్డి, వెంకటమ్మ, శ్రీదేవి, దేవీసింగ్ పాల్గొన్నారు.

ఇంట్లో జారిపడి డీఎమ్ఆర్ఎల్ ఉద్యోగి మృతి

చంపాపేట, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ఇంట్లో కాలుజారి పడడంతో డీఎమ్ఆర్ఎల్ ఉద్యోగి మృతి చెందిన సంఘటన గురువారం కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. కంచన్‌బాగ్ డీఆర్‌డీవో టౌన్‌షిప్‌లో నివాసం ఉంటూ డీఎమ్ఆర్ఎల్‌లో ఉద్యోగం చేస్తున్న రావుల కవిత(48) గురువారం ఉదయం ఇంట్లో కాలుజారి పడడంతో తలకు తీవ్రగాయాలైనాయి. కుటుంబ సభ్యులు ఆమెను స్థానిక అపోలో డీఆర్‌డీఓ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. మృతురాలు భర్త ప్రకాష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ లింగరాజు తెలిపారు.



హస్తినాపురం చౌరస్తాలో కొవ్వొత్తులతో మృతులకు నివాళులు అర్పిస్తున్న జస్టిస్ బి.చంద్రకుమార్, సీనియర్ సిటిజన్స్



విజయవాడ జాతీయ రహదారిపై క్యాండిల్ ర్యాలీ చేపట్టిన కార్పొరేటర్ రాధాధీరజ్‌రెడ్డి, శేఖర్‌జీ, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్లా ఉపేందర్‌రెడ్డి



కొవ్వొత్తుల ర్యాలీలో మూసారాంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీరెడ్డి తదితరులు



ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన వారికి నివాళ్లు అర్పిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, నూతి శ్రీనివాస్ తదితరులు

ఉగ్రదాడులకు నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ

ఎల్బీనగర్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): జమ్మూకాశ్మీర్‌లో మంగళవారం జరిగిన ఉగ్రదాడులకు పాల్పడిన ముష్కరులను అంతమొందించాలని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు పేరాల శేఖర్‌రావు, అందెల శ్రీరాములుయాదవ్, కార్పొరేటర్ రాధాధీరజ్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాంభూపాల్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి పిట్లా ఉపేందర్‌రెడ్డి కోరారు. ఉగ్రదాడులకు నిరసనగా బీజేపీ ఆధ్వర్యంలో గురువారం ఆర్‌కేపురం డివిజన్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జమ్మూకాశ్మీర్‌లో పర్యటిస్తున్న యాత్రికులపై ఉగ్రవాదులు దాడి చేయడం పిరికిపందల చర్య అని దుయ్యబట్టారు. ఉగ్రవాదాన్ని తుద ముట్టించేందుకు కేంద్రం మరింత పటిష్టమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఆరుట్ల సురేష్, కొప్పు బాష, రాములుయాదవ్, రమేష్, కరుణ, వెంకటేష్‌యాదవ్, సంతోష్, శ్రీనివాస్, రమేష్, సిద్ధు పాల్గొన్నారు.

వాసవీకాలనీలో..

పహల్గావ్‌లో దుశ్చర్యలకు పాల్పడ్డ ఉగ్రవాదులను తుదముట్టించాలని యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చిలుక మధుర ఉపేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ వాసవీకాలనీలో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాశ్మీర్‌లో ప్రశాంతవాతావరణం నెలకొన్న తరుణంలో ఉగ్రవాదులు పంజా విసిరి అమాయక భారతీయులను పొట్టనపెట్టుకున్నారని మండిపడ్డారు.

ఉగ్రవాదుల దాడి సహించరానిది: బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి

వనస్థలిపురం: జమ్ముకాశ్మీర్‌లోని పహల్గామ్ టూరిస్టులపై ఉగ్రవాదులు జరిపిన దాడి సహించరానిదని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు వనపల్లి శ్రీనివాస్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉగ్రవాదుల దాడిలో మృతిచెందిన వారి ఆత్మ శాంతించాలని కోరుతూ వనస్థలిపురం డివిజన్ అధ్యక్షుడు నూతి శ్రీనివాస్ ఆధ్వర్యంలో వనస్థలిపురం వీధుల్లో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ భారతీయులపై అత్యంత దుర్మార్గంగా ఉగ్రవాదులు దాడిచేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, అంజన్‌కుమార్ గౌడ్, క్రాంతిగౌడ్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



మీర్‌పేట్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నేతలు

ఆర్ఎన్ఆర్‌కాలనీలో కొవ్వొత్తుల ప్రదర్శన

అబ్దుల్లాపూర్‌మెట్: జమ్మూ కశ్మీర్ పహల్గాంలో పర్యాటకులపై జరిగిన దాడిని నిరసిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో కుంట్లూర్ ఆర్ఎన్ఆర్ కాలనీలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర నాయకులు ఆందోజు రవీంద్రాచారి, ముత్యాల యాదిరెడ్డి మాట్లాడుతూ పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని తీవ్రంగా ఖండించారు. వెంటనే ఉగ్రవాదులను పట్టుకుని కఠినంగా శిక్షించాలన్నారు. మాజీ కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్, నర్సింహ, నవనీత పాల్గొన్నారు.

- అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీతో ప్రదర్శన చేశారు.



అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలో కొవ్వొత్తుల ప్రదర్శన చేస్తున్న బీజేపీ నాయకులు



జిల్లెలగూడలో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

దాడికి పాల్పడిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు బండిగారి విష్ణుగౌడ్, గోవర్ధన్‌గౌడ్, జంగమయ్యగౌడ్, వీరస్వామిగౌడ్, రమాదేవి, ఎంసీ యాదగిరిగౌడ్, రాజు, సత్యనారాయణ, శ్రావణ్, రామకృష్ణ, రమేష్ పాల్గొన్నారు.

- **సరూర్‌నగర్ :** జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గావ్‌లో హిందూ యాత్రికులపై జరిగిన ఉగ్రదాడులకు వ్యతిరేకంగా బీజేపీ మీర్‌పేట్ శాఖ అధ్యక్షుడు భిక్షపతిచారి, ముఖేశ్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఇందులో భాగంగా మీర్‌పేట్ చౌరస్తాలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి, మృతుల కుటుంబాలకు ఘనంగా నివాళులర్పించారు. పార్టీ నాయకులు, పలువురు మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

జిల్లెలగూడలో..

బీఆర్ఎస్ మీర్‌పేట్ శాఖ అధ్యక్షుడు అర్కల కామేశ్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ దిండు భూపేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో గురువారం జిల్లెలగూడ చౌరస్తాలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పలువురు మాజీ కార్పొరేటర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



కొత్తపేట చౌరస్తా సమీపంలో క్యాండిల్ ర్యాలీ చేపట్టిన యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చిలుక మధుర ఉపేందర్‌రెడ్డి, ఇతర నేతలు



ఆర్ఎన్ఆర్ కాలనీలో కొవ్వొత్తులతో ర్యాలీ తీస్తున్న సీపీఐ నాయకులు

సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో..

చంపాపేట: జమ్మూ కశ్మీరులోని పహల్గావ్‌లో పర్యాటకులపై జరిగిన దాడికి నిరసనగా హస్తినాపురం చౌరస్తాలో గురువారం రాత్రి సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులను వెలిగించి మృతులకు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ మాట్లాడుతూ ఇది అత్యంత క్రూరమైన చర్యయని అన్నారు. ఇది మానవత్వానికి తీరని మచ్చయని, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ జస్టిస్ బి.చంద్రకుమార్, ఎస్వీ.సుబ్బారాయుడు, ఎస్.సాంబయ్య, కొండారెడ్డి, విఠల్, రాజలింగం, సీతారాంరెడ్డి పాల్గొన్నారు.

చాదర్‌ఘాట్: పహల్గావ్ ఘటనను నిరసిస్తూ శాలివాహన వాకర్స్‌క్లబ్ అధ్యక్షుడు రామాచారి, కార్యదర్శి పి.కమలాకర్, కోశాధికారి యాదయ్యల ఆధ్వర్యంలో జరిగిన కొవ్వొత్తుల ర్యాలీలో మూసారాంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీరెడ్డి తదితరులు పాల్గొన్నారు. పాకిస్తాన్ ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దేశ ఐక్యతకు ప్రతి ఒక్కరూ చేయూత నివ్వాలని, ఉగ్ర చర్యలపై ఉద్యమించడంలో కేంద్రానికి అండగా నిలవాలని కార్పొరేటర్ పిలుపునిచ్చారు.

దేశానికి దిక్సూచి అంబేడ్కర్: ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి

ఎల్బీనగర్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): భారతరత్న డాక్టర్ బీ.ఆర్ అంబేడ్కర్ ఈ దేశానికి దిక్సూచి అని ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. అంబేడ్కర్ జయంతి ఉత్సవాల్లో భాగంగా బీజేపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు ఉత్సవాల కమిటీ జిల్లా కన్వీనర్ పిట్లా ఉపేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కొత్తపేటలోని స్పైసీ హబ్‌లో మేధావులు, విద్యావంతులు, సాఫ్ట్‌వేర్ నిపుణులతో అంబేడ్కర్ జీవిత చరిత్రపై సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్‌లో విశ్వేశ్వర్‌రెడ్డి, బీజేపీ జాతీయ కార్యవర్గసభ్యులు పేరాల శేఖర్‌రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పంతంగి రాజభూపాల్‌గౌడ్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ అంబేడ్కర్ ఆలోచన విధానం ఈ తరానికి మార్గదర్శనమన్నారు. అంబేడ్కర్ ఆశయాలను కేవలం మాటలకే పరిమితం చేసింది కాంగ్రెస్ అని ఆయన అన్నారు. ఒక్క బీజేపీ మాత్రమే అంబేడ్కర్ ఆశయాలను తూచతప్పకుండా అమలు చేస్తుందన్నారు. ప్రధాని మోదీ వల్ల 120 దేశాలలో అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను జరుపుకుంటున్నారని అన్నారు. జాతీయ విద్యావిధానంలో అంబేడ్కర్ జీవిత చరిత్రను పాఠ్యాంశంగా చేర్చారని ఆయన తెలిపారు. ఈ సెమినార్‌లో అంబేడ్కర్ జయంతి ఉత్సవాల కమిటీ రాష్ట్ర కన్వీనర్ తాడూరి శ్రీనివాస్, చింతా సాంబమూర్తి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు అందెల శ్రీరాములుయాదవ్, కార్పొరేటర్ రాధాధీరజ్‌రెడ్డి, కొప్పు బాషా, రాములుయాదవ్, బచ్చిగళ్ల రమేష్, కరుణ, వెంకటేష్‌యాదవ్, ఆరుట్ల సురేష్, సంతోష్, శ్రీనివాస్, రమేష్ పాల్గొన్నారు.



సెమినార్‌లో మాట్లాడుతున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

వరద నీరు నిల్వకుండా చర్యలు : ఎమ్మెల్యే బలాల

చాదర్‌ఘాట్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): మలక్‌పేట ఆర్‌యూబీ రోడ్డులో వర్షం కురిసినప్పుడల్లా వరదనీరు భారీగా చేరడంతో తలెత్తుతున్న సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే అహ్మద్ బలాల తెలిపారు. గురువారం సాయంత్రం ఆయన జీహెచ్ఎంసీ మలక్‌పేట సర్కిల్-6 ఈఈ పీర్ సింగ్, ఏఈ మల్లికార్జున్, హెచ్‌ఆర్‌డీసీఎల్ డిప్యూటీ ఈఈతో కలిసి మలక్‌పేట ఆర్‌యూబీ రోడ్డును పరిశీలించారు. ఇటీవల మలక్‌పేట ఆర్‌యూబీ రెండు వెంట్‌లకు అదనంగా మూడో వెంట్ నిర్మాణ సమయంలో నిర్మించిన ప్రహరీ కారణంగా అక్కడున్న వరద నీటి కాలువ పూర్తిగా మట్టితో పూడ్చుకుపోయిందని ఈఈ పీర్‌సింగ్ వివరించారు. ఇటీవల కురిసిన భారీ వర్షానికి ఆర్‌యూబీ రోడ్డు పూర్తిగా వరద ప్రవాహంతో నిండిపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఆర్‌యూబీ రెండు వెంట్‌ల కిరుపైపులా ఉన్న వరద నీటి కాలువ పూడికను తొలగించేందుకు చర్యలు చేపట్టారు. ఇందుకు మలక్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్ తన సిబ్బందితో ప్రత్యేక చొరవ చూపారని ఈఈ ఎమ్మెల్యేకు వివరించారు. మూడో వెంట్ నిర్మాణ సమయంలో నిర్మించిన ప్రహరీకి వరద నీరు పోయేందుకు వీలుగా రంధ్రం ఏర్పాటు చేయడంతో వరద సమస్య తాత్కాలికంగా తొలగిందన్నారు. వరదనీరు నిల్వకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అందుకు అవసరమైన ప్రణాళికను రూపొందించాలని ఎమ్మెల్యే బలాల సూచించారు. ఎంఐఎం నాయకులు మోహియుద్దీన్ అబ్రార్, సైఫుద్దీన్ షఫీతోపాటు పలువురు పాల్గొన్నారు.



మలక్‌పేట ఆర్‌యూబీ రోడ్డులో నీరు నిల్వకుండా చేపట్టాల్సిన చర్యలపై ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బలాల

బాలాపూర్‌లో అక్రమ వలసదారులను గుర్తించాలి

- **వారి సర్టిఫికెట్లు పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలి**
- **అధికారులకు బీజేపీ నేతల వినతి**

సరూర్‌నగర్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్, పాకిస్తాన్ దేశాల నుంచి రోహింగ్యాలు అక్రమంగా దేశంలోకి ప్రవేశించి నగరం చుట్టుపక్కల ఉన్న ప్రాంతాల్లో నివసిస్తున్నారని, అలాంటి వారిని గుర్తించి దేశం నుంచి పంపించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు రెవెన్యూ అధికారులను కోరారు. ఈ మేరకు గురువారం బీజేపీ బడంగ్‌పేట్ క్లస్టర్-12 అధ్యక్షులు రామకృష్ణారెడ్డి, వీరకర్ణారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు బాలాపూర్ తహసీల్దార్ ఇందిరాదేవిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ బాలాపూర్ మండల రెవెన్యూ పరిధిలోని బడంగ్‌పేట్ కార్పొరేషన్, మీర్‌పేట్ కార్పొరేషన్, జల్‌పల్లి మునిసిపాలిటీల పరిధిలోని పలు ప్రాంతాల్లో రోహింగ్యాలు నివసిస్తున్నట్టు తెలిసిందని, అధికారులు ఆయా ప్రాంతాల్లోని రోహింగ్యాలను గుర్తించి వారి వద్ద ఉన్న పత్రాలను పరిశీలించి దేశం నుంచి పంపించి వేయడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. రెవెన్యూ, మునిసిపల్, పోలీసు విభాగాల అధికారులు సంయుక్తంగా దీనిపై సర్వే నిర్వహించాల్సిన అవసరం ఉన్నదని వారన్నారు. రోహింగ్యాలు నివసిస్తున్న ప్రాంతాల్లోని మతపరమైన కేంద్రాలు, మదర్సాలలో అసాంఘిక కార్యక్రమాలు నడుస్తున్నాయని, వాటి ద్వారా దేశభద్రతకు ముప్పు పొంచి ఉన్నదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. శరణార్థుల పేరుతో భారత్‌లోకి ప్రవేశించిన రోహింగ్యాలు.. ఇక్కడ బోగస్ ఆధార్, ఓటర్, రేషన్ కార్డులు, కరెంటు బిల్లులు సృష్టించుకుని స్థానిక సంస్థల నుంచి అక్రమంగా నివాస ధ్రువీకరణ పత్రాలు పొంది భారత పౌరులుగా స్థిరపడడానికి ప్రయత్నిస్తున్నారని వారు ఆరోపించారు. ఈ దృష్ట్యా అధికారులు సమగ్ర సర్వే నిర్వహించి రోహింగ్యాల వద్ద ఉన్న సర్టిఫికెట్లను తనిఖీ చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో ఏనుగు రాంరెడ్డి, పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మహేందర్, నర్సింహారెడ్డి, రాజ్‌కుమార్, తిరుమలేశ్ పాల్గొన్నారు.

తొలగించిన 262 మంది సిబ్బంది విధుల్లోకి..

చాదర్‌ఘాట్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీలో చెత్త తరలించే 814 మంది సిబ్బందిలో గురువారం 262 సిబ్బందిని తిరిగి విధుల్లోకి తీసుకుంటూ గ్రేటర్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. మరో 120మంది సిబ్బందిని ఇదివరకే విధుల్లోకి తీసుకున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీంతో 382మంది సిబ్బంది తిరిగి విధుల్లోకి చేరారు. మలక్‌పేట సీటీవో కార్యాలయం ఎదుట తొలగించబడిన సిబ్బంది ధర్నా చేసిన విషయాన్ని ఆంధ్రజ్యోతి వెలుగులోకి తీసుకువచ్చింది. గురువారం గ్రేటర్ కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా చేసేందుకు వెళ్లిన సిబ్బందికి 262మంది సిబ్బందిని తిరిగి విధుల్లో తీసుకుంటున్నట్లుగా గ్రేటర్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇదిలా ఉండగా 814మంది సిబ్బందిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలంటూ మలక్‌పేటలోని సీటీవో కార్యాలయం ఎదుట ధర్నా చేసిన గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ అవుట్ సోర్సింగ్ ట్రాన్స్‌ఫోర్ట్ అధ్యక్షుడు మంద రవీందర్‌ను విధుల్లోకి తీసుకోవడంలో పెండింగ్‌లో పెట్టారు. తిరిగి విధుల్లోకి తీసుకుంటున్నట్లు జారీ చేసిన ఉత్తర్వులో మంద రవీందర్ పేరును నాట్ ఇన్ లిస్ట్‌గా పేర్కొన్నారు. ఇంకా ఎంత మంది సిబ్బందిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలనే వివరాలపై పూర్తిగా స్పష్టత రావాల్సి ఉందని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు ఉదరి గోపాల్ తెలిపారు.

మంత్రి 'పీఏ'నని చెప్పుకుంటూ.. మోసాలకు పాల్పడుతున్న వ్యక్తిపై కేసు

మన్సూరాబాద్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పీఏనని చెప్పుకుంటూ మోసాలకు పాల్పడుతున్న వ్యక్తిపై నాగోల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల వివరాల ప్రకారం.. భూపాలపల్లి జిల్లా చిట్యాలకు చెందిన బుస్స వెంకట్‌రెడ్డి(34) నాగోల్‌లోని మమతానగర్‌లో నివాసముంటున్నాడు. కాగా నిరుద్యోగి అయిన ఇతడు ఈజీగా డబ్బు సంపాదించాలన్న లక్ష్యంతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పీఏనని ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే అధికారులు, ఉద్యోగులతో పరిచయం చేసుకుని తనకు కావాల్సిన పనులను చేసుకుంటూ మోసాలకు పాల్పడుతున్నాడు. ఇందులో భాగంగా 2024 సంవత్సరం నవంబర్ 11న గోపాలపురం ఎస్ఐకి ఫోన్‌చేసి లైసెన్స్ లేకుండా ప్రయాణిస్తున్న తన బావమరిదిని వదిలిపెట్టాలని, డిసెంబర్ 11న భూపాలపల్లి ఒక నేరంతో సంబంధం ఉన్న తన స్నేహితుడికి సాయం చేయాలని, 14న ఉప్పల్ ఇన్‌స్పెక్టర్‌కు ఫోన్‌చేసి శృతి అనే అమ్మాయి స్టడీ సర్టిఫికెట్లు పోయాయని ఆమెకు సాయం చేయాలని, 17న టప్పాచబుత్ర ఇన్‌స్పెక్టర్‌కు ఫోన్‌చేసి తన స్నేహితుడు ఫోన్ పోగొట్టుకున్నాడని, 30న నాచారం ఇన్‌స్పెక్టర్‌కు ఫోన్‌చేసి తన స్నేహితుడికి ఒక విషయంలో సాయం చేయమని, 2025 జనవరి 15న పెద్దకొత్తపల్లి ఇన్‌స్పెక్టర్‌కు ఫోన్‌చేసి కుటుంబ సమస్యలతో ఉన్న తన స్నేహితుడికి సాయం చేయమని, ఫిబ్రవరి 5న నాగోల్ ఇన్‌స్పెక్టర్‌కు ఫోన్‌చేసి ఒక కేసులో సాయం చేశావంటూ విందుకు రమ్మని ఆహ్వానించడం, 12న ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్‌కు ఫోన్‌చేసి తన బావమరిదిని సెంట్రింగ్ కార్మికుడు మోసం చేశాడని, అతడికి సాయం చేయమని కోరడం, కొన్ని నెలల క్రితం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పీఏకి ఫోన్ చేసి బీటెక్ సీటు కోసం ఎమ్మెల్యే లెటర్ కావాలని కోరడం, మంత్రి పొంగులేటి పేషిలో సాయం కోసం ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పీఏ ఈనెల 6న అతడికి పీఏ తిరిగి ఫోన్ చేయగా అతడిపై అనుమానం రావడంతో విచారించగా బుస్స వెంకట్‌రెడ్డి మంత్రి పొంగులేటి పీఏ కాదని తేలింది. ఏడాది నుంచి 9966664882 నంబర్‌ను ఉపయోగించి ఎంతో మందికి మంత్రి పీఏనని చెప్పుకుంటూ మోసాలకు పాల్పడుతున్నట్లు నిర్ధారణలో తేలింది. ఈ మేరకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కార్యాలయంలో డీపీఓగా పనిచేసే పేరాల నరేష్ యాదగిరి గురువారం నాగోల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా బుస్స వెంకట్‌రెడ్డిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

బీఆర్ఎస్ రజతోత్సవాలకు తరలాలి : ఎమ్మెల్యే

చంపాపేట, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ ఈనెల 27న వరంగల్‌లో నిర్వహించనున్న రజతోత్సవాల భారీ బహిరంగ సభకు నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ జెండా పండుగలో భాగంగా హస్తినాపురం డివిజన్‌లోని నందనవనం ఇంద్రసేనారెడ్డినగర్‌కాలనీ, జడ్పీరోడ్ డీఆర్‌డీఎల్ కాలనీ చౌరస్తాలో పార్టీ జెండాలను ఎమ్మెల్యే గురువారం ఎగురవేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ డివిజన్ నుంచి అత్యధిక సంఖ్యలో సభకు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ఆందోజు సత్యంచారి, మాజీ కార్పొరేటర్ పద్మానాయక్, నాయకులు పాల్గొన్నారు.

పోచమ్మ ఆలయంలో..

చంపాపేట డివిజన్ దుర్గానగర్‌కాలనీలోని పోచమ్మ ఆలయంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి గురువారం పూజలు చేశారు. ఆలయం మొదటి వార్షికోత్సవాలను పురస్కరించుకొని ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

రజతోత్సవ మహాసభను విజయవంతం చేయాలి: అర్కల

సరూర్‌నగర్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో ఈనెల 27వ తేదీన జరుగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని మీర్‌పేట్ కౌన్సిల్ బీఆర్ఎస్ మాజీ ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి పార్టీ శ్రేణులను కోరారు. గురువారం జిల్లెలగూడలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు అర్కల కామేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని రజతోత్సవ మహాసభ-చలో వరంగల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అర్కల మాట్లాడుతూ మొన్నటి ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించి బాధ పడుతున్నారని, మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే రావాలని వారు కోరుకుంటున్నారని అన్నారు. వరంగల్ సభను విజయవంతం చేయడం ద్వారా వచ్చే ఎన్నికలకు విజయ సంకేతం చూపించాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ దిండు భూపేశ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి శ్రీనునాయక్, నాయకులు దీప్‌లాల్, సునీత, పి.విజయలక్ష్మి, రజాక్, పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, సిద్దాల బీరప్ప, యాదిరెడ్డి, మేదరి రమేశ్, యాదగిరి, చారి, మోహన్, అర్జున్, జంగయ్య, లతాశేఖర్, రాజు, సాలయ్య, సాయి, హాథీరామ్, పవన్, జగాల్‌రెడ్డి పాల్గొన్నారు.



బీఆర్ఎస్ జెండా పండుగలో పాల్గొన్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి